

పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సేద తీరేందుకు పార్కులు ఉపయోగం : సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరేందుకు పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ కాస్మోపాలిటన్‌కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కును ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, ప్రస్తుతం పార్కుల్లో నిర్మించే ఓపెన్ జిమ్ పరికరాలు నాసిరకంగా ఉంటూ కొన్ని రోజులకే విరిగిపోతున్నాయన్నారు. అసోసియేషన్ స్థలంలో కమ్యూనిటీ హాల్, ఆటస్థలం కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. అదేవిధంగా భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని మన్సూరాబాద్ రోడ్డును వెడల్పు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు జగదీశ్‌యాదవ్, నాగరాజు, రఘువీర్ రెడ్డి, రుద్రనర్సింహ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

కాస్మోపాలిటన్‌కాలనీలో పార్కు ప్రారంభం

వనస్థలిపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణానికి పార్కుల ను సద్వినియోగం చేసుకోవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. కాస్మోపాలిటన్ కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కును కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్కులను కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనర్సింహ, పి.శ్రీనివాసరావు, శ్రీకాంత్, సత్తయ్య పాల్గొన్నారు.



కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డిని సన్మానిస్తున్న లక్ష్మీప్రియనగర్ కాలనీవాసులు

లక్ష్మీప్రియనగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

హయత్‌నగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని లక్ష్మీప్రియనగర్ కాలనీవాసులు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డిని ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంక్షేమ సంఘం నాయకులు కార్పొరేటర్‌కు వివరించారు. అదేవిధంగా రోడ్లు, వీధి లైట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా భూగర్భ డ్రైనేజీ లైనును ఏర్పాటు చేయిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కార్పొరేటర్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మధుసూదన్‌రెడ్డి, నిరంజన్‌యాదవ్, శ్రీధర్ గౌడ్, మధుకర్‌రెడ్డి, అచ్చిరెడ్డి, ఉపేందర్, తాతారావు, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, రాములు, మణికుమార్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

వనస్థలిపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ శక్తినగర్‌లో ఆదివారం సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో చేపట్టాలన్నారు. అభివృద్ధి పనుల్లో కాలనీవాసులు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



బస్తీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

బస్తీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

కొత్తపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): మోహన్‌నగర్ బస్తీ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం మోహన్‌నగర్ బస్తీ ప్రతినిధులు ఆయనను కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో - డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి జలమండలి అధికారులను సంప్రదిస్తామన్నారు. కార్యక్రమంలో బస్తీ ప్రతినిధులు ఉపేందర్‌సింగ్, రాజ్‌కుమార్‌సింగ్, గోవర్ధన్, జంగయ్య, దినేష్ రామకృష్ణ, నాయకులు రాజేష్, రాకేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో చేరేందుకు ముందుకు రావాలి : జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ లైఫ్ మెంబర్ షిప్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ నర్సింహారెడ్డి

చాదర్‌ఘాట్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో చేరేందుకు యువతీ, యువకులు, సామాజిక కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సొసైటీ రంగారెడ్డి జిల్లా చైర్మన్ ఎస్.నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ ఆదేశాల మేరకు ఆదివారం మూసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీలో గల శాలివాహన మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిలో సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ లైఫ్ మెంబర్‌షిప్ స్పెషల్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. యువతీ, యువకులు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలను నిర్వహించడంతో పాటు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. టీబీ రహిత తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై వైద్య శిబిరాలను నిర్వహించడంలో చేయూతనివ్వాలని ఆయన సూచించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ సతీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సైదాబాద్ బోనాల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

- 47 సంవత్సరాలుగా ఘనంగా మహంకాళి జాతర
- 20న బోనాల ఉత్సవం, 21న ఘటాల ఊరేగింపు

సైదాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో జరిగే మహంకాళి జాతరలో సైదాబాద్ బోనాల జాతర విశేష ప్రాచుర్యాన్ని పొందింది. భాగ్యనగరం ప్రజలు ఆరాధ్యదైవంగా పూజించే మహంకాళి అమ్మవారి ఉత్సవాలు సైదాబాద్ ప్రాంతంలో ఈనెల 20న (ఆదివారం) ప్రారంభం కానున్నాయి. శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 46 సంవత్సరాల నుంచి మహంకాళి జాతర జరుపుతూ ఈ సంవత్సరం కూడా వేడుకలు ఘనంగా జరిపేందుకు సిద్ధమయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించే సైదాబాద్ బోనాల జాతరకు ఓ ప్రత్యేకత ఉన్నది. బోనాల ఉత్సవ సందర్భంగా 20న బోనాల ఉత్సవం, 21న మధ్యాహ్నం 1-30 గంటల నుంచి అమ్మవారి ఘటం ఊరేగింపు, గావుపెట్టె, పలహారబండ్ల ఊరేగింపు, 32న మధ్యాహ్నం జరిగే అన్నదాన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి. అమ్మవారి ఘట్టాల ఊరేగింపులో పౌరాణిక వేషాలు ధరించి భక్తి భజన పాటలతో కనువిందు చేసే ఆర్కెస్ట్రా,



ఆలయంలో కొలువుతీరిన అమ్మవారు

పోతురాజుల వేషాలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. దేశభక్తిని పెంపొందించే భగత్‌సింగ్, మహాత్మాగాంధీ, అల్లూరి సీతారామరాజు, శివాజీ, రాణాప్రతాప్ వంటి దేశ భక్తుల వేషధారణలతో జాతీయ సమైఖ్యతను చాటిచెప్పేలా ప్రదర్శనలు ఇప్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహంకాళి జాతర ఉత్సవ కమిటీ..

శ్రద్ధాబాద్ మహంకాళి జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, అధ్యక్షుడిగా కె.మల్లేశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడి గా కడారి రాంకుమార్, ప్రధాన కార్యదర్శిగా జి. శ్రీనివాస్ చందర్జీ, ఉపాధ్యక్షులుగా సహదేవ్‌యాదవ్, గౌలీకార్ దినేష్, కోళ్ళ గోపీ, సి.జైల్‌సింగ్, కోశాధికారిగా గోలీకార్ పూర్ణచందర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎల్.సాయిబాబా, ఆశీష్, అరవింద్, సంపత్, సంయుక్త కార్యదర్శులుగా కె.సుభాష్, వినయ్, వినేశ్, సంతోష్‌గౌడ్ సాంస్కృతిక కార్యదర్శులుగా జి.జైపాల్ రెడ్డి, పి. ఆనంద్, సలహాదారులుగా కావేటి జగన్నాథం, గౌరిశంకర్‌గౌడ్, కార్యవర్గసభ్యులుగా కిషోర్, ప్రవీణ్, శ్రీనివాస్, అశ్విన్, మహేశ్, విజయ్, కడారి సర్వోత్తం, అభిషేక్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, మధుగౌడ్, గౌరిశంకర్, క్రాంతిగౌడ్, అమిత్, శంకరానంద్ వ్యవహరిస్తున్నారు.



ఘటాల ఊరేగింపులో పౌరాణిక వేషాలు(ఫైల్)

బోనాల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు



శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 46సంవత్సరాల నుంచి మహంకాళి జాతర ఘనంగా జరుపుతున్నాం. కుల, మతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరిలో మహత్తర శక్తి, భక్తిని పెంచడంలో మహంకాళి జాతర ఉత్సవాలు ప్రతీకలు. రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో ఈ యేడు సైతం ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాలు ప్రశాంతవాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలి. **- కె. మల్లేష్, అధ్యక్షుడు, ఉత్సవ కమిటీ**

నాదర్‌గుల్‌లో కాసువాగు రైతుల బోనాల జాతర

సరూర్‌నగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల కాసువాగు రైతులు ఆదివారం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి ఆదిపోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా నాదర్‌గుల్‌లోని మల్లికార్జుననగర్ కాలనీలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లోనూ అందెల పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పోరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి మహేశ్, మర్రి ప్రభాకర్‌రెడ్డి, రచ్చ లక్ష్మణ్, శశిధర్‌రావు, చింతల రాఘవేందర్‌ముదిరాజ్, పోరెడ్డి నితిన్‌రెడ్డి, సామ నిశికాంత్‌రెడ్డి, మనీష్‌ముదిరాజ్, జేడీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.



కాసువాగు రైతులు నిర్వహించిన బోనాల జాతరలో అమ్మవారిని దర్శించుకుంటున్న శ్రీరాములుయాదవ్

సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దం బోనాలు

వనస్థలిపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దం బోనాల ఉత్సవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్



మహాలక్ష్మికాలనీ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్ తదితరులు

మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మహాలక్ష్మి, శాంతివనం కాలనీలో ఆదివారం బోనాల ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. కార్పొరేటర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బొడిగె యాదయ్యగౌడ్, స్వామిగౌడ్, నందకిషోర్, రాకేష్, రాజు, ఉపేందర్, హరి, సురేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి : లచ్చిరెడ్డి

డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని కార్పొరేటర్ లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీనివాసపురం కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు లెవల్స్‌ను చూసుకుంటు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత ప్రియులకు వీనుల విందు

- ఐదుగురు గురువులు, 50మంది వయోలిన్, వీణ, వేణువుల వాద్య కళాకారులు

కొత్తపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సంగీత ప్రియులకు నాదరమణీయం కళాకారులు వీనుల విందు అందించారు. స్నేహపురి కాలనీలో గల పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర ఆలయం - శ్రీనివాస కల్యాణ మండపం ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ వాద్య స్వరార్చనకు వేదికైంది. గురుపూర్ణోత్సవాల్లో భాగంగా వేణుగాన విద్వాన్ నాదరమణీయం - వేణుగానసభ వ్యవస్థాపకుడు శేషం రమణ ఆధ్వర్యంలో ఐదుగురు శాస్త్రీయ సంగీత, నృత్య గురువులు, 50మంది వయోలిన్, వీణ, వేణువు, మృదంగం వాద్య కళాకారులు పలు కీర్తనలు వినిపించారు. సంగీత వాద్య కళాకారులు ఆకాశవాణి అగ్రశ్రేణి వేణు గాన కళాకారులు గురువు వీ.నాగరాజును స్మరించుకున్నారు. ఆదిశంకర వివచిత రాగమాలికతో గణేష పంచరత్నంతో శేషం రమణ, ఆయన శిష్యబృందం వేణుగాన స్వరార్చన మొదలైంది. సంగీత విద్వాంసురాలు డా.వై.రమాప్రభ, కూచిపూడి గురువు దుర్గేశ్



వీణలు, వేణువులపై కీర్తనలను వినిపిస్తున్న గురువులు, శిష్యులు

నందినిలకు శిష్యబృందం సన్మానం చేశారు. శాంతిచంద్రిక, రాధికాశ్రీనివాసన్, భట్టి భవన్‌సింగ్ శిష్యులు వేణువు, వీణ, వయోలిన్‌లపై పలు కీర్తనలు వాయిస్తూ గురువులకు స్వరార్చన చేశారు. ఈ సంగీత స్వరార్చనకు డా.శ్రీకాంత్, శ్రీధరాచారి, అచ్చుతానంద, వేదాంత్ మృదంగ సహకారం అందించారు. ఆలయ ధర్మకర్తల మండలి ప్రతినిధులు కళాకారులకు, సంగీత ప్రియులకు ఏర్పాట్లు చేశారు.

ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడులకు యత్నించిన బీజేవైఎం

- ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం

వనస్థలిపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ బండ్లగూడలోని నవచేతన విజ్ఞాన కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. అందులో భాగంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్న మారణకాండను ఆపాలని ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతుల్లో తీర్మానం చేశారు. ఈ క్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నవచేతన విజ్ఞాన సమితి కేంద్రం రోడ్డు ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. సమాచారం అందుకున్న బీజేపీ అనుబంధ సంఘమైన బీజేవైఎం నాయకులు రహదారిపై నిరసన కార్యక్రమం చేపడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకుల వద్దకు వెళ్లి మీరు కేవలం పాలస్తీనా, ఇజ్రాయిల్, అమెరికా దాడుల గురించి మాత్రమే ఎందుకు ప్రశ్నిస్తున్నారు. పహల్గామ్ దాడి గురించి ఎందుకు ప్రశ్నించడం లేదని వాదిస్తూ వీడియోను చిత్రీకరించారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న నాగోల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించి అక్కడ నుంచి పంపించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు నవచేతన విజ్ఞాన సమితి కార్యాలయం లోపలికి వెళ్లి గేట్లు వేసుకున్నారు. పోలీసులు వెళ్లిపోయారని నిర్ధారించుకున్న బీజేవైఎం నాయకులు తిరిగి నవచేతన విజ్ఞానసమితి గేటు ముందు నినాదాలు చేస్తూ, గేటును తోసుకుంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులపై కర్రలతో దాడికి యత్నించారు. దీంతో కాసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అక్కడ ఉన్న ఇతర



కర్రలతో దాడులకు యత్నిస్తున్న బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు

ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇరువర్గాలను సముదాయించి అక్కడి నుంచి బీజేవైఎం నాయకులను పంపించడంతో శాంతియుత వాతావరణం ఏర్పడింది.

బీజేవైఎం నేతలను అరెస్ట్ చేయాలి : ఖాద్రీ

శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడికి యత్నించిన బీజేవైఎం నాయకుల తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, పోలీసులు తక్షణమే అరెస్ట్ చేసి వారిని కఠినంగా శిక్షించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వలిఉల్లి ఖాద్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి ధర్మేంద్రతో కలిసి ఖాద్రీ ప్రకటన విడుదల చేశారు.

చికిత్స పొందుతూ.. ఆటో డ్రైవర్ మృతి

చంపాపేట : అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతిచెందాడు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ సీ బ్లాక్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎండీ ఖాజా(41) శనివారం అతిగా మద్యం సేవించి ఇంటి సమీపంలో అపస్మారకస్థితిలో పడిపోయాడు. స్థానికులు చూసి అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఖాజా ఆదివారం ఉదయం మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు. తాగుడుకు బానిస కావడంతో మృతుడి భార్య, పిల్లలు ఖాజాను కొన్ని సంవత్సరాల కిందట వదిలి వేసి ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టింటికి వెళ్లిపోయారు. మృతుడి అల్లుడు హమ్మద్‌బేగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నల్లపోచమ్మ ఆలయంలో సీపీఐ నాయకుల పూజలు

హయత్‌నగర్ జూలై 13(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని అంజనాద్రినగర్‌కాలనీలో ఆదివారం నల్లపోచమ్మ ఆలయంలో స్థానిక సీపీఐ నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మన్, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్‌నాయక్, వేశాల నర్సింహ, సత్తిరెడ్డి, రాజేందర్, రమేష్‌రెడ్డి, రాధాకృష్ణతో పాటు అంజనాద్రినగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- రూ.4.54లక్షల నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఎనిమిది మంది అరెస్టు

సరూర్‌నగర్: కొంత కాలంగా నివాస గృహాల మధ్య గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం ఎల్బీనగర్ ఎస్‌వోటీ, మీర్‌పేట్ పోలీసులు కలిసి దాడి చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని ఆర్‌ఎంఆర్ కాలనీలో గల ఓ ఇంటిని స్థావరంగా ఏర్పాటు చేసుకున్న కొందరు వ్యక్తులు.. పెద్ద మొత్తంలో డబ్బు పెట్టి పేకాట ఆడుతున్నారు. సాయిబాబా అనే వ్యక్తి ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కాగా వీరిని రెగ్యులర్‌గా గమనించిన కాలనీవాసులు కొందరు.. వారు పేకాట ఆడుతున్నట్లు గుర్తించి ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. దాంతో ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు, మీర్‌పేట్ పోలీసులు సంయుక్తంగా సదరు ఇంటిపై దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4.54లక్షలు నగదుతో పాటు ఎనిమిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

విశ్వకర్మల సమస్యలను పరిష్కరించాలి

- సీఎంని కోరిన అఖిల భారత విశ్వకర్మ మహాసభ



సీఎంకి వినతిపత్రం ఇస్తున్న జగన్నాథం

వనస్థలిపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం అన్నారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జగన్నాథం మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం సంతోషకరం అన్నారు. సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని సెలవు దినంగా ప్రకటించాలని, ఉప్పల్ భాగాయత్‌లో కేటాయించిన 5 ఎకరాల స్థలంలో రూ.200 కోట్లతో విశ్వకర్మ భవనం నిర్మించాలని, విశ్వకర్మ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, 55ఏళ్లు నిండిన వృత్తిదారులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని ప లు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సీఎంకు ఆయన అందజేశారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న మహిళా ప్రతినిధులు

సైదాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సైదాబాద్ మసీదులో రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు మర్యమ్ అజీమ్ నేతృత్వంలో జరిగిన శిబిరంలో వలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మర్యమ్ అజీమ్ మాట్లాడుతూ మానవసేవగా ప్రపంచ వ్యాప్తంగా ఆహారం, తాగునీరు, పునరావాసం, విపత్తు సహాయ కార్యకలాపాలలో తమ సంస్థ సేవలందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆయేషా అహ్మద్, భూపేందర్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.



కాశీనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న నవయుగ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు

గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కాశీనాథ్‌రెడ్డి

సరూర్‌నగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలో రానున్న వినాయక చవితిని పురస్కరించుకుని నవయుగ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాలకు గాను గణేశ్ ఉత్సవ కమిటీకి నూతన అధ్యక్షుడిగా అర్కల కాశీనాథ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. ప్రతియేటా ఉత్సవ కమిటీకి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటామని, అదే తరహాలో ఈ సారి కాశీనాథ్‌ను ఎన్నుకున్నామని వారు పేర్కొన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా కాశీనాథ్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, జిల్లెల దామోదర్‌రెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి, సప్పిడి జంగారెడ్డి, జెనిగె జంగయ్యయాదవ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిద్దాల కృష్ణ, పోరెడ్డి సుధాకర్‌రెడ్డి, సిద్దాల మహేశ్, సురేందర్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

చంపాపేట : అకారణంగా యువకుడిపై వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. హఫీజ్‌బాబానగర్‌కు చెందిన అబ్దుల్లా(35) అదే ప్రాంతానికి చెందిన ఉమర్‌తో స్నేహం చేస్తూ తాగుడుకు బానిసయ్యాడు. దీంతో అతడి అన్న గౌస్ ఉమర్‌తో తిరగవద్దని తమ్ముడిని మందలించాడు. ఇది తెలిసిన ఉమర్ తనను ఎందుకు దూషించినావని గౌస్‌పై ఆదివారం దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచాడు. గౌస్ ఫిర్యాదు మేరకు ఉమర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్ స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు.



మృతుడి కుటుంబ సభ్యులకు డబ్బులను అందజేస్తున్న సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీశంకర్‌యాదవ్ తదితరులు

అనారోగ్యంతో మృతిచెందిన కరాటే మాస్టర్ కుటుంబానికి సురక్ష సంఘం ఆసరా

అబ్దుల్లాపూర్‌మెట్ : అనారోగ్యంతో మృతిచెందిన కరాటే మాస్టర్ అంత్యక్రియలకు సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. దాంతో వచ్చిన రూ.19,000 నగదును మృతుడి కు టుంబ సభ్యులకు అందజేశారు. ఏపీ రాష్ట్రానికి చెందిన శివ(36) భార్య, ఇ ద్దరు పిల్లలతో కలిసి కొన్ని ఏళ్ల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయ తీ పరిధిలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నాడు. అతడు స్థానికంగా ఉంటున్న పిల్లలకు కరాటే నేర్పిస్తూ జీవనం సాగించేవాడు. అయితే రెండు ఏళ్ల క్రితం బైక్‌పై నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలకు గురై కాళ్లు పని చేయకపోవడంతో మంచానికే పరిమితం అయ్యాడు. దీంతో అతడి భార్య కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. కాగా అనారోగ్యం విషమించడంతో ఆదివారం ఉదయం అతడు మృతిచెందాడు. మృతుడి అంత్యక్రియలు చేసేందుకు కూడా ఆ కుటుంబం వద్ద చిల్లిగవ్వ లేకపోవడంతో సురక్ష సేవా సంఘం ఆసరాగా నిలిచింది. సామాజిక మాధ్యమాల ద్వారా రూ.19,000 విరాళాలు సేకరించిన సంఘం అధ్యక్షుడు కొక్కెర గోపీశంకర్‌యాదవ్ దగ్గరుండి శివ అంత్యక్రియలను జరిపించారు. అంత్యక్రియల ఖర్చులు పోగా మిగతా డబ్బులను వారికి అందజేసినట్లు ఆయన తెలిపారు.